ఎమ్మెల్సీ కవితను కలిసిన రాష్ట్ర కుమ్మరి సంఘం సభ్యులు

కుమ్మర్ల సమస్యలపై మండలిలో చర్చిస్తా

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

బండ్లగూడ,డిసెంబర్ 26: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కుమ్మర్ల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమయ్యిందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. కుమ్మరి సంఘం సభ్యులు, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజు, నిమ్మలూరు శ్రీనివాస్, దూగుంట్ల నరేశ్ తదితరులు ఎమ్మెల్సీ కవితను గురువారం కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడుతున్నాయని అందులో బీసీలకు అధిక శాతం సీట్లు కేటాయించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కామారెడ్డిలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో రాహుల్‌గాంధీ బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ కుమ్మర్ల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని అన్నారు. శాసన మండలి సమావేశంలో కుమర్ల సమస్యలపై చర్చిస్తానని తెలిపారు.

మాజీ ఎంపీ మందా జగన్నాథంకు అస్వస్థత

పరామర్శించిన మాజీ మంత్రులు హరీశ్ రావు, శ్రీనివాస్ గౌడ్, దయాకర్ రావు

నిమ్స్ దవాఖానలో మంద జగన్నాథం ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న మాజీ మంత్రులు హరీశ్ రావు, శ్రీనివాస్ గౌడ్, దయాకర్ రావు

ఖైరతాబాద్, డిసెంబర్ 26 : నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గురువారం ఉదయం ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు నిమ్స్ దవాఖానలో చేర్పించారు. జగన్నాథం మూత్రపిండాలు, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్నారని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప తెలిపారు. నిమ్స్ ఆర్ఐసీయూలో ఆయనకు వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తున్నారు. అస్వస్థత విషయాన్ని తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు, ఎమ్మెల్యేలు లక్ష్మీరెడ్డి, వివేకానంద, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు నిమ్స్‌కు చేరుకొని ఆరోగ్య పరిస్థితి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

దాశరథి కవిత్వాలు శక్తివంతమైనవి

మహాకవి దాశరథి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్, ప్రముఖ కవి,రచయిత నందిని సిధారెడ్డి

ప్రముఖ కవి,రచయిత నందిని సిధారెడ్డి... బుక్‌ఫెయిర్‌లో సందర్శకుల సందడి

చిక్కడపల్లి,డిసెంబర్26 : ఇందిరాపార్క్ సమీపంలోని కళా భారతి ఎన్టీఆర్ స్టేడియంలో 37వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్ 8వ రోజు సందర్శకులతో సందడి నెలకొంది. గురువారం మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి బుక్ ఫెయిర్‌ను సందర్శించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా జరిగే బుక్ ఫెయిర్ అన్ని రకాల పుస్తకాల కూడలి లాంటిందన్నారు. విద్యార్థులు, యువకులు, ప్రతి ఒక్కరూ బుక్ ఫెయిర్‌ను సందర్శించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బుక్ ఫెయిర్ అధ్యక్ష, కార్యదర్శులు యాకూబ్, ఆర్.వాసు, ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, కోశాధికారి నారాయణ రెడ్డి, బొమ్మగాని కిరణ్, ప్రముఖ న్యాయవాది బొమ్మగాని ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బుక్‌ఫెయిర్‌ను సందర్శించిన మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి

మహాకవి దాశరథి పుస్తకావిష్కరణ..

తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో కుసుమ ధర్మన్న కళాపీఠం ముద్రించిన మహాకవి దాశరథి శతజయంతి సందర్భంగా దాశరథి పై రాసిన 'మహాకవి దాశరథి' పుస్తక పరిచయ సభను బుక్ ఫెయిర్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్, ప్రముఖ కవి,రచయిత నందిని సిధారెడ్డి హాజరై మాట్లాడారు. నిజాం కాలంలో దాశరథి పోరాట ఘట్టాలను వివరించారు. జైలు గోడలపై ఆయన రాసిన కవిత్వాలు ఎంతో శక్తివంతమైనవన్నారు. ఆ కవిత్వాలతో వట్టికోట ఆళ్వారు స్వామి, దాశరథి మధ్య ఉండే ఉద్యమ మైత్రీని వివరించారు. రామకృష్ణ చంద్రమౌళి సభాధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు డాక్టర్ యాకూబ్, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్.ఎన్.బాలాచారి,గంటా మనోహర్ రెడ్డి, నాగయ్య, కళాపీఠం చైర్‌పర్సన్ సరోజినీ దేవి, గోల్కొండ సాహితీ కళా సమితి అధ్యక్షుడు చంద్ర ప్రకాశ్ రెడ్డి, రాధా కుసుమ తదితరులు పాల్గొన్నారు.

వికీపీడియాపై అవగాహన ఉండాలి..

బుక్ ఫెయిర్ లో తెలుగు వికీపీడియా లక్ష వ్యాసాలు ప్రస్థానం కార్యక్రమంలో 'వికీపీడియా గురించి మీకు తెలుసా' అనే ఉచిత పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వికీపీడియాల్లో ఎక్కువ వ్యాసాలను కలిగిఉన్న జాబితాలోకి చేరడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో బుక్ ఫెయిర్ అధ్యక్షుడు యాకూబ్, వికీపీడియన్లు కృపాల్ కశ్యప్, వి.జె.సుశీల, గుంటుపల్లి రమేశం, ప్రణక్ష్మి రాజ్ వంగరి, నాగరాణి బేతి తదితరులు పాల్గొన్నారు.

'శ్రీ శూద్రగంగ' ఆవిష్కరణ..

ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ రచించిన 'శ్రీ శూద్రగంగ' వచన రూప కావ్యం ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కడప యోగివేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ప్రొఫెసర్ వినోదిని మాదాసు అధ్యక్షత వహించిన ఈ సభలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కాశీం, లోకకవి అందే శ్రీ, ప్రముఖ సినీ నటుడు,రచయిత ఉత్తేజ్, ప్రముఖ రచయిత భూపతి వెంకటేశ్వర్లు, ప్రముఖ కవి, విమర్శకుడు బెల్లి యాదయ్య, ప్రముఖ కవి, కోయ కోటేశ్వర రావు, అంతర్జాతీయ చిత్రకారుడు ఏలే లక్ష్మణ్, బంగారు బహ్మం తదితరులు పాల్గొన్నారు.

సినీ గేయరచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ రచించిన శ్రీ శూద్రగంగ కావ్య ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రొఫెసర్ కాశీం తదితరులు

వికీపీడియా గురించి మీకు తెలుసా పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ

అంతర్జాతీయ పోటీ పరీక్షల్లో

రెసోనెన్స్ విద్యార్థుల ప్రతిభ

సిటీబ్యూరో, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : మాదాపూర్ రెసోనెన్స్ గ్లోబల్ క్యాంపస్‌కు చెందిన విద్యార్థులు అంతర్జాతీయ పోటీ పరీక్షల్లో అద్భుతంగా రాణించారని రెసోనెన్స్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్ మేనేజింగ్‌డైరెక్టర్ పూర్ణ చంద్ర రావు తెలిపారు. ఎస్ఏటీ, ఐఈఎల్టీస్ వంటి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. విద్యార్థులు అభిగ్న్య ముక్క, శౌర్య, అద్వైత్, సాయి విశ్వేష్, శాంతి, అభిరామ్, కృష్ణ, యోజిత, కృష్ణ కార్తీక్, సిరి వర్షిణీలను ఆయన అభినందించారు.

28న పీవీ నరసింహారావు

పురస్కారం కాళోజీకి ప్రదానం

సమావేశంలో మాట్లాడుతున్న పద్మశ్రీ డా.టి.హనుమాన్ చౌదరి

రవీంద్రభారతి, డిసెంబర్ 26 : పీవీ నరసింహారావు స్మారక పురస్కారాన్ని ప్రముఖ ప్రజా కవి దివంగత కాళోజీ నారాయణరావుకు పీపీ మెమోరియల్ ఫౌండేషన్ ప్రకటించింది. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రముఖ సాంకేతిక నిపుణుడు పద్మశ్రీ డా.టి.హనుమాన్ చౌదరి, ఆర్టీఐ మాజీ కమిషనర్ విజయ్‌బాబు, విశ్రాంత ఐఏఎస్ అధికారి బాలలత, పీవీ మెమోరియల్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మాదంశెట్టి అనిల్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. పీవీ నరసింహారావు స్మారక పురస్కారాన్ని నరల్లమోతుల భాస్కర్‌రావుకు ఈ నెల 28న రవీంద్రభారతిలో అందజేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీ సురభీ వాణీదేవి అమీర్ అలీఖాన్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, సాంస్కృతిక శాఖ సారథి వెన్నెల గద్దర్ పాల్గొంటారని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పతనం ఖాయం

విద్యార్థులు చదువుకోకుండా కుట్రలు

ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలి

జనవరి 3న కలెక్టరేట్ల ముట్టడి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య

రవీంద్రభారతి,డిసెంబర్ 26 ఫీజు బకాయిలు రూ. 5వేల కోట్లు చెల్లించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ,బీసీ విద్యార్థులను చదువుకోకుండా కుట్రలు చేస్తుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు,ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. బడా కాంట్రాక్టర్లకు వేలాది కోట్ల బడ్జెట్‌ను కేటాయించి డబ్బు చెల్లిస్తూ కమీషన్లు తీసుకుంటున్న ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది దాటిన ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా చెల్లించలేదని విమర్శించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్ కృష్ణయ్య హాజరై మాట్లాడారు. 16 లక్షల 75 వేల మంది విద్యార్థుల ఫీజులు చెల్లించకుండా, కాంట్రాక్టర్ల జేబుల్లోకి వేలకోట్ల బిల్లులు చెల్లిస్తున్నారని, విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించడంలేదని సీఎం రేవంత్‌రెడ్డికి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు ఫీజు బకాయిలు చెల్లించడానికి మనసు అంగీకరించడం లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 11 నెలలు గడుస్తున్నా 12 సార్లు విద్యార్థుల ఫీజుల కోసం ధర్నాలు, రాస్తారోకలు చేసినా ఈ ప్రభుత్వానికి దున్నపోతుమీద వాన పడ్డట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బకాయిలు చెల్లించాలని జనవరి 3వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా చలో కలెక్టరేట్లు, ఆర్డీవో, ఎంఆర్ఓ కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. విద్యార్థులు రోడ్డపైకి వచ్చి ఉద్యమాలు చేస్తున్న పట్టించుకోవడంలేదని, ఆర్థిక శాఖ మంత్రి కాంట్రాక్టర్లు అంటే చాలా ప్రేమ ఉందని, కానీ విద్యార్థుల బాధలు పట్టించుకోవడం లేదన్నారు. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తన వైఖరిని మార్చుకోకపోతే విద్యార్థుల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు పరీక్షలకు రాయడానికి హాల్‌టికెట్లు ఇవ్వడంలేదని, పై చదువులు చదువుకోవడానికి సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో బడుగుబలహీన వర్గాల విద్యార్థులు చదువుల మధ్యలోనే ఆపేసి రోడ్లపైన తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ విద్యార్థులను ఉపయోగించుకొని ఇప్పుడు గాలికివదిలేశారని, ఇదేనా ప్రజాపాలన అని కృష్ణయ్య ధ్వజమెత్తారు. విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు సంవత్సరానికి రూ. 5,500లు చెల్లిస్తే ఎక్కడ సరిపోతుందని ఆయన ప్రశ్నించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రూ. 20వేలు పెంచాలని, ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమానికి విద్యార్థులు భారీగా తరలివచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్,జల్లపల్లి అంజి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య

బీసీ కులాల ఐక్యవేదిక నూతన కార్యవర్గం

నియామక పత్రాలను అందజేస్తున్న అధ్యక్షుడు బ్రహ్మయ్య

ఆర్కేపురం, డిసెంబర్ 26 : కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్న దేశ జనాభా గణనలో కులాల వారీగా లెక్కలు తీయాలని బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పెద్దపూర బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. గురువారం కొత్తపేటలోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా బ్రహ్మయ్య, కన్వీనర్‌గా మద్దెల వినయ్ కుమార్, కోశాధికారిగా బొడ్డుపల్లి మధు, ఉపాధ్యక్షుడిగా శ్రీను, యూత్ అధ్యక్షుడిగా నాగిళ్ల జగన్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా కుంచాల బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా ఆమని గంటి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా గుండ్రనరం చంద్రశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శంకర్ స్వామి, ఎల్బీనగర్ ప్రధాన కార్యదర్శిగా లింగన్న ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య వారికి నియామక పత్రాలను అందజేశారు. పగడాల ఎల్లయ్య, శ్రీను, చంద్రశేఖర్, శ్రీనివాస్, నవీన్, వినయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

కొండాపూర్, డిసెంబర్ 26 : మాదాపూర్‌లోని శిల్పారామంలో గురువారం పలువురు నృత్యకారుల సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కూచిపూడి నాట్య గురువులు మద్దాలి ఉషా గాయత్రి శిష్య బృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శనలివ్వగా, సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ తంజావూరు ఆధ్వర్యంలో రూపచంద్ బృందం పురూలీ చౌ జానపద నృత్య ప్రదర్శనలతో అలరించారు.

ట్రా ఫికర్

నగరంలో గురువారం కురిసిన వర్షానికి ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. దీంతో రోడ్లమీద ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గంటల తరబడి రోడ్లమీదే వాహనాలు ఆగిపోవడంతో నగరవాసులు ఆందోళనకు గురయ్యారు.